
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

భద్రాద్రి కొత్తగూడెం 5
శుక్రవారం ఉష్ణోగ్రత ఖమ్మం : గరిష్ఠం 31 । కనిష్ఠం 20 భద్రాద్రి కొత్తగూడెం : గరిష్ఠం 32 । కనిష్ఠం 21 శనివారం, 27 జనవరి 2024



కొత్తగూడెం ప్రగతి మైదానంలో జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం సమర్పిస్తున్న కలెక్టర్ ప్రియాంక అలా, ఎస్పీ రోహిత్‌రాజ్

అభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయం

- ప్రజాపాలనతో జిల్లా ప్రగతి మున్ముందుకు
- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ ప్రియాంక అలా

కొత్తగూడెం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ప్రజాపాలనతో జిల్లా ప్రగతితో మున్ముందుకు పోతోందని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా పేర్కొన్నారు. శుక్రవారం కొత్తగూడెం ప్రగతిమైదానంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ఆమె గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె ప్రసంగిస్తూ కొత్త ప్రభుత్వ ఏర్పడిన తర్వాత రెండురోజుల్లోనే రెండు పథకాలను ప్రారంభించుకోవడం సంతోషదాయకమని, ప్రజాసంక్షేమంలో ప్రభుత్వ సంకల్పానికి ఆరుగ్యారంటీ పథకాలే నిదర్శమన్నారు. ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణం ఎంతో ఆదరణ పొందిందని, ఈ పథకంతో ఆర్థిక పురోగతి సాధన లక్ష్యంగా వివిధ పనులకు వెళ్లే అతివలు, విద్యార్థినులకు, మధ్యతరగతి మహిళలకు చేయూత లభించినట్టయ్యిందన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందాలని, ఏ ఒక్కరు ప్రాణాలు కోల్పోకూడదని, ప్రజల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యతమిచ్చిన రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ లాంటి గొప్ప పథకాన్ని తిరిగి ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా విస్తృతపరిచిందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 2,37,530మంది ఆరోగ్యశ్రీ పథకం కింద నమోదు చేసుకున్నారని, గతేడాది డిసెంబరు 9న ప్రారంభమైన ఆరోగ్యశ్రీ పథకంలో జిల్లాలో 252మందికి వివిధ రకాల వైద్య సేవలు అందించి రూ.3,71,500 ఖర్చు చేశామన్నారు. ప్రజాపాలన కింద ఆరుగ్యారంటీ పథకాల కోసం గతనెల 28నుంచి జనవరి 6వ తేదీ వరకు జిల్లాలో 481గ్రామ పంచాయితీలు, నాలుగు మున్సిపాలిటీల పరిధిలో105 వార్డుల్లో గ్రామ సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించామని, జిల్లా వ్యాప్తంగా మొత్తం 3,34,227 దరఖాస్తులు అందాయన్నారు. వాటన్నిటిని ప్రభుత్వం నిర్ధేశించిన పోర్టల్‌లో అప్‌లోడ్ చేశామని, ప్రభుత్వ తదుపరి ఉత్తర్వుల మేరకు చర్యలు తీసుకునేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టు పనులను వేగిరం చేసి రానున్న వర్షాకాలం నాటికి సాగు నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మారు మూల గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యాల కల్పనకు అటవీ అనుమతులు మంజూరు చేశామని, ఇప్పటికే చేపట్టిన పనులను వేగవంతం చేశామని, రహదారులు, వంతెనల నిర్మాణాలతో మారు మూల గ్రామాల్లో నివసించే ప్రజలకు ప్రయా ణ సౌకర్యం కల్పించామన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



గ్రామాల సర్వతోముఖా భివృద్ధికి ప్రతీ గ్రామం యూనిట్‌గా ప్రణాళికల రూప కల్పనలతో ప్రభుత్వం ముందుకెళుతోందని వివరించారు. రైతుల సంక్షేమం, అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమగ్రాభివృద్ధికి నిరంతరం కృషిచేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీసీఎం మల్లు భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలతో పాటు పార్లమెంట్, శాసనమండలి, శాసనసభ్యులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, జిల్లా ప్రజలు, అధకారు లకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వివిధ శాఖల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న పలువురు అధికారులు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శిం చిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకోగా.. ప్రగతి మైదానంలో ప్రభుత్వం తరుపున ఏర్పాటుచేసిన వివిధ స్టాళ్లను కలెక్టర్ ప్రియాంక అలా, ఎస్పీ రోహిత్‌రాజ్, అదనపు కలెక్టర్ రాంబాబు పరిశీలించారు. ఈ వేడుకల్లో కొత్త గూడెం, ఇల్లెందు, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, కోరం కనకయ్య, జారే అదినారయణ, జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావుతో పాటు పలుశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమానికి ప్రాధాన్యం

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్‌జైన్



త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న ప్రతీక్‌జైన్

గిరిజనుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ వారిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ అన్నారు. గణతంత్ర వేడుకల్లో భాగంగా శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు, కొమరం భీం లాంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని, భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలో ఐటీడీఏ ద్వారా నాలుగు జిల్లాలోని గిరిజనులకు సేవలందిస్తున్నామని, ముఖ్యంగా విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. మెరుగైన విద్య, వైద్యం అందించడంతో పాటు రహదారులు, ప్రభుత్వ భవనాల లాంటి సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు.

కార్మికుల సంక్షేమం, సింగరేణి అభివృద్ధే లక్ష్యం
సింగరేణి సీఎండీ బలరాం

దేశ విద్యుత్ అవసరాలను తీర్చడంతో పాటు కార్మికుల సంక్షేమం, సింగరేణి అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని, అందులో భాగంగానే నూతన ప్రాజెక్టుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటు న్నామని సీఎండీ ఎన్.బలరాం తెలిపారు. కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో శుక్రవారం జరిగిన గణతంత్ర వేడుకల్లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. 135ఏళ్ల చరిత్ర కలిగిన సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తితో పాటు, విద్యుత్ ఉత్పత్తి రంగంలోకి అడుగు పెట్టిందన్నారు. నూతన ప్రాజెక్ట్‌ల ఏర్పాటు కోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేసి సంస్థ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్మికుల సంక్షేమానికి యాజమాన్యం పెద్దపీట వేస్తోందని, వారసులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగ అవకాశాన్ని కల్పిస్తున్నామని వివరించారు.



జెండాను ఆవిష్కరిస్తున్న సీఎండీ బలరాం



గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రియాంక అలా



గౌరవ వందనం స్వీకరిస్తున్న సింగరేణి సీఎండీ



తిరంగా జెండాలతో విద్యార్థినుల ప్రదర్శన



స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తున్న ఎస్పీ, కలెక్టర్

నేటినుంచి జేఈఈ మెయిన్స్

- ఆరు కేంద్రాల్లో పరీక్షలకు ఏర్పాట్లు



ఖమ్మం ఖానాపురం హవేలి, జనవరి 26: ఎన్‌టీఏ ఆధ్వర్యంలో 2024 విద్యాసంవత్సరానికి సంబంధించి నిర్వహించే జేఈఈ మెయిన్స్ మొదటి విడత పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 1వరకు జరిగే ఈ పరీక్షలకుగాను ఖమ్మం జిల్లా పరిధిలో ఆరు కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కోఆర్డినేటర్ ఆర్.పార్వతీరెడ్డి తెలిపారు. బొమ్మ, శ్రీ చైతన్య ఎస్‌బీఐటీ, విజయ, ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలు, కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ మొదటివిడత పరీక్షకు అన్ని సెంటర్ల లో కలిపి 7,960 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. రెండు షిఫ్టుల్లో ఈ పరీక్షలు జరగనుండగా ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు మొదటి, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండో షిఫ్టు పరీక్షలు జరగనున్నాయి. పరీక్షకు హాజరయ్యేవారు నిర్ణీత సమయానికి గంటముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాల్సింటుందని, ఈ పరీక్షలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, ప్రభుత్వ గుర్తింపు కార్డు లేదా ఆధార్ కార్డుతో బొటన వేలిముద్ర అనుసంధానం చేసి ఉంటుంది. రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత మాత్రమే విద్యార్థి పరీక్ష రాసే స్థానం నిర్ధేశించనున్నారు. ప్రతీ ఒక్కరు ఆధార్ కార్డు, రేషన్ లేదా ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ట్రాన్సరెంట్ పెన్, అడ్మిట్ కార్డు వాటర్ బాటిల్ వెంట తీసుకొని రావాల్సి ఉంటుంది. పరీక్ష కేంద్రాల వద్ద పూర్తిస్థాయి పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష అనంతరం రఫ్ బుక్ లెట్‌ను డ్రాప్ బాక్స్‌లో వేయాల్సి ఉంటుంది. ప్రతీ ఒక్కరు తమ అడ్మిట్ కార్డులో సూచించిన సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, పరీక్ష కేంద్రాల వద్ద గుంపులు గుంపులుగా ఉండకూడదనే ఉద్దేశంతో అడ్మిట్ కార్డులో ఉన్న సమయానికి పరీక్ష కేంద్రాలకు రావాలని కో ఆర్డినేటర్ సూచించారు.



ఫైవ్స్‌తో పారదర్శకత

- ఎరువుల సరఫరా, నిల్వలు, క్రయ, విక్రయాలకు సరికొత్త యాప్
- కొత్తగా 'ఫర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టం'
- డీఏవో నుంచి ఏవో వరకు అన్నిస్థాయిల్లో తనిఖీలు
- ఈ-పాస్ వినియోగించకుంటే చర్యలు
- హైదరాబాద్ నుంచే పర్యవేక్షణ

ఖమ్మం వ్యవసాయం, జనవరి 26: సాగుదిగుబడిలో రైతులకు ఎరువులు ఎంతో సాయం చేస్తాయి. వాటి సరఫరాలో పారదర్శకత కోసం ప్రభుత్వం ఎప్పటికప్పుడు కొత్త మార్గాలను అన్వేషిస్తూనే ఉంటుంది. ఈ క్రమంలోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్తగా ఫైవ్స్(ఫర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టం)ను ప్రవేశ పెట్టాయి. ఆ మేరకు ఒక ప్రత్యేక యాప్‌ను తెచ్చాయి. డీలర్లు ఎప్పటికప్పుడు ఎరువుల క్రయ విక్రయాలకు సంబంధించిన పూర్తి వివరాలు ఆ యాప్‌లో నమోదు చేయాలి. ఈ-పాస్ మిషన్లను తప్పనిసరిగా వినియోగించాలి. ఈ యాప్ సాయంతో జిల్లా వ్యవసాయ అధికారి మొదలు ఏవో వరకు అన్ని స్థాయిల్లో అధికారులు తమకు కేటాయించిన దుకాణాలను తనిఖీ చేయనున్నారు. జిల్లా వ్యవసాయ అధికారి ప్రతి ఏడు రోజులకు మూడు దుకాణాలు, డివిజనల్ వ్యవసాయ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు ప్రతి మూడు రోజులకు పది రిటైల్ దుకాణాలు తనిఖీ చేయాలి. వారానికి 20 దుకాణాలు చెక్ చేయాలి. సంబంధిత అధికారులు ఎక్కడెక్కడి దుకాణాలు తనిఖీ చేయాలనేది హైదరాబాద్‌లోని కమిషనరేట్ నుంచే కేటాయింపు ఉంటుంది. ఆ మేరకు అధికారులు రెండు ప్రధానమైన విషయాలను పరిశీలించాలి. కంపెనీ వచ్చిన ఎరువుల సరఫరా ఈ-పాస్‌లో ధ్రువీకరించాలి. నిల్వలు, అమ్మకాలు కూడా ఈ-పాస్ ద్వారా జరపుతున్నారా? లేదా? చూడాలి. ప్రతి డీలర్ దుకాణంలో భౌతిక నిల్వలు ఈ- పాస్‌లో చూపబడుతున్న నిల్వలతో సమానంగా చూపిస్తున్నారా..? లేదా? అనే విషయాలను పరిశీలించాలి. అందులో రైతుల వివరాలు, వారి భూమి విస్తీర్ణం, ఆధార్ అనుసంధానంతో జరుగుతున్నాయా..? లేదా? అనేది రికార్డుల ఆధారంగా పరిశీలించాలి. రిజిస్టర్లలో సంతకాలు చేసి వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి.

ఖమ్మం జిల్లాలో ప్రారంభం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలులోకి తెచ్చిన ఈ ఫైవ్స్ విధానాన్ని ఖమ్మం జిల్లాలో వ్యవసాయ అధికారులు అమలులోకి తెచ్చారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎం. విజయనిర్మల ఈమేరకు హోల్‌సేల్ దుకాణాలను తనిఖీ చేస్తున్నారు. డివిజనల్ వ్యవసాయ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు కూడా తమకు కేటాయించిన 10 దుకాణాల్లో కొన్నింటిని బుధవారం తనిఖీ చేశారు. ఈ విధానంపై డీలర్లకు కూడా అవగాహన కల్పించారు. ఎరువులు సక్రమంగా విక్రయించేందుకు ఈ-పాస్ మిషన్లను తప్పనిసరిగా వినియోగించాలని అధికారులు డీలర్లకు చెప్పారు. దుకాణాల్లో ఉన్న నిల్వలు, అమ్మకాలకు వ్యత్యాసం కనిపిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. జిల్లాలో ఎరువుల నిల్వలు సరిపడా ఉన్నాయని డీఏవో విజయనిర్మల తెలిపారు.



తమ్మినేనికి సీఎం రేవంత్‌రెడ్డి పరామర్శ



తమ్మినేనితో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి 26 : ఊపిరితిత్తుల సంబంధ సమస్యతో హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రాన్ని సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఈ క్రమంలో రేవంత్‌రెడ్డి తమ్మినేని ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీపీఎం రాష్ట్ర నాయకులు ఎస్ వీరయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కమిటీ సభ్యుడు ఎస్.నవీన్‌రెడ్డి ఉన్నారు.

నేడు ఖమ్మం జిల్లాలో మంత్రి తుమ్మల పర్యటన



ఖమ్మం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10గంటలకు హైదరాబాదులో బయలుదేరి మధ్యాహ్నం 1గంటకు ఖమ్మం చేరుకుని స్థానిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. సాయంత్రం 4గంటలకు రఘునాథపాలెం మండలం మంచుకొండలో హెల్త్ సబ్‌సెంటర్‌కు శంకుస్థాపన, 5గంటలకు ఖమ్మంరూరల్ మండలం పెద్దతండా లోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కాలేజీలో జరిగే సృజనోత్సవ్‌లో పాల్గొంటారు. రాత్రి 10గంటలకు ప్రకాష్‌నగర్‌లో జరిగే ప్రైవేటు కార్యక్రమానికి హాజరవుతారు.

డీసీఎంఎస్ చైర్మన్‌గా కొత్వాల

- బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలిచ్చిన జిల్లా సహకార అధికారి



ఖమ్మం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం జిల్లా మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ బాధ్యతలను ప్రస్తుత వైస్‌చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావుకు అప్ప గిస్తూ జిల్లా సహకార అధికారి విజయ కుమారి శుక్రవారం ఆదేశా లు జారీ చేశారు. దీంతో ఆయన సోమవారం చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించబోతున్నారు. ప్రస్తు తం ఖమ్మం డీసీఎంఎస్ చైర్మన్‌గా ఉన్న రాయల వెంకటశేషగిరిరావు జిల్లా కేంద్ర సహకారబ్యాంకు నుంచి 2018అక్టోబరు 24న రూ.27లక్షల కారు రుణం తీసుకుని.. 2020ఏప్రిల్24 వరకు నెలవారీ రుణ వాయిదా లను సక్రమంగానే చెల్లించారు. తర్వాత గడువు ప్రకారం చెల్లించకపోవడం, గతేడాది జనవరి4కు రుణవాయిదా గడువు పూర్తికావడంతో సహకారబ్యాంకు 1964చట్ట నిబంధనల ప్రకారం ఆయనకు డీఫాల్టర్ నోటీసులు జారీచేశారు. ఆతర్వాత ఆయన ఈఏడాది జనవరి18న మొత్తం రుణాన్ని రూ.23,22,100లను చెల్లించారు. కొవిడ్ కారణంగా గతంలో చెల్లించలేదని గతంలో వివరణ ఇచ్చినా సహకారశాఖ నిబంధనలు అనుసరించి ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న తల్లాడ మండలం గంగదేవిపాడు సొసైటీ డైరెక్టర్ పదవినుంచి తొలిగించారు.

దీంతో ఆ సొసైటీ అధ్యక్ష పదవితోపాటు ఖమ్మం డీసీఎంఎస్ డైరెక్టర్, చైర్మన్ పదవులను కోల్పోయారు. దీంతో వైస్‌చైర్మన్‌గా ఉన్న కొత్వాల శ్రీనివాసరావుకు చైర్మన్ బాధ్యతలు అప్పగిస్తూ డీసీవో ఆదేశాలు జారీచేశారు. ఇక రాయలశేషగిరిరావు ప్రాతినిధ్యం వహి స్తున్న గంగదేవిపాడు సొసైటీ అధ్యక్షుడిగా అక్కడి ఉపాధ్యక్షుడు తూ ము వీరభద్రదరావును నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో ఖమ్మం డీసీఎంఎస్ చైర్మన్ పదవికి, అలాగే గంగదేవిపాడు సొసైటీకి నోటిఫికేషన్ ద్వారా ఎన్నిక నిర్వహించనున్నారు.

డీసీసీబీ చైర్మన్ కూరాకులపై నేడు అవిశ్వాసం

- క్యాంపు నుంచి ఖమ్మం చేరుకున్న వీ వెంకటాయపాలెం సొసైటీ డైరెక్టర్లు



ఖమ్మం, జనవరి 26 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : బీఆర్ఎస్‌కు చెందిన ఖమ్మం జిల్లా కేంద్ర సహకారబ్యాంకు చైర్మన్ కూరాకుల నాగ భూషయ్య ప్రాతినిధ్యం వహిస్తున్న వీ.వెంకటా యపాలెం సొసైటీ చైర్మన్ పదవికి శనివారం అవిశ్వాస సమావేశం జరగబో తుంది. వి వెంకటాయపాలెం సొసైటీ చైర్మన్‌గా ఉన్న డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్యపై అవిశ్వాసం ప్రకటిస్తూ సొసైటీలోని 13మంది డైరెక్టర్లలో 11మంది సంతకాలు చేసి డీసీవోకు అందజేశారు. దీంతో డీసీవో అవిశ్వాస ప్రక్రియకు గాను శనివారం ఆ సొసైటీ కార్యా లయంలో ఉదయం 11గంటలకు సమావేశం ఏర్పాటు చేశారు. చైర్మన్‌కు వ్యతిరేకంగా 11మంది డైరెక్టర్లు ఉండడంతో కూరాకుల నాగభూషయ్య వెంకటాయపాలెం సొసైటీ అధ్యక్ష పదవి కోల్పోయే అవకాశం కనిపిస్తోంది. ఇది జరిగితే నిబంధనల ప్రకారం ఆయన డీసీసీబీ డైరెక్టర్ పదవితోపాటు చైర్మన్ పదవిని కోల్పోనున్నారు. డీసీసీబీ చైర్మన్, వి వెంకటాయపాలెం సొసైటీ అధ్యక్ష పదవి ఖాళీ అయితే వి వెంకటా యపాలెం సొసైటీ వైస్ చైర్మన్‌గా ఉన్న రావెళ్ల శ్రీనివాసరావుకు సొసైటీ అధ్యక్ష బాధ్యతలు, ఖమ్మం డీసీసీబీ వైస్‌చైర్మన్‌గా ఉన్న దొండపాటి వెంకటేశ్వరరావుకు చైర్మన్ బాధ్యతలు అప్పగించి ఆతర్వాత ఖమ్మం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు డైరెక్టర్, చైర్మన్ పదవికి, వీ.వెంకటాయపాలెం అధ్యక్ష పదవికి నోటిఫికేషన్ విడు దల చేసి ఎన్నిక నిర్వహించనున్నారు.

నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌లో పురాతన విగ్రహం లభ్యం

» భక్తరామదాసుదిగా పేర్కొంటున్న చరిత్రకారులు

నేలకొండపల్లి, జనవరి 26: నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌లోని రావి చెట్టు కింద ఓ పురాతన విగ్రహాన్ని కనుగొన్నారు. ఈ విగ్రహం ఎప్పటినుంచో రావిచెట్టు వద్ద ఉంటున్నా ఎవరూ పట్టించుకోలేదు. కానీ పదిరోజుల క్రితం ఓ వ్యక్తి ఈ విగ్రహాన్ని ఫొటో తీసి 'కొత్త తెలంగాణా చరిత్ర' బృంద సభ్యులు రామోజుహరగోపాల్, కట్టా శ్రీనివాస్‌కు పంపగా వారు పరిశీలించి ఆ విగ్రహం భక్త రామదాసు విగ్రహమని, అర్ధనగ్నంగా, అంజలి ముద్రతో, స్థానక భంగిమతో మొన కిందకు పెట్టిన కత్తి, ఎడమ సంధిటపెట్టి నిల్చున్న భక్తుడు, మీసాలతో, స్నానం చేసి తల వెనుక జారుముడి వేసుకున్న గోష్పాద శిఖతో కనిపిస్తోందని వారు పేర్కొంటున్నారు. ఆలయ మర్యాదలతో నిలబడిన రాజ హోదాకలిగిన వ్యక్తిదని, కుడి, ఎడమ భుజాల మీద చక్ర, శంఖు ముద్రలుండటంతో వైష్ణవ భక్తునిదన్నారు. చెవులకున్న కుండలాలు, మెడలో హారం అతని నిరాడంబరతను తెలుపుతున్నాయని చెబుతున్నారు. అయితే ఈశిల్పం రాజోచిత ఆహార్యంతో లేనందున అక్కన్న, మాదన్నలది కాదనివారి మేనల్లుడు, భద్రాచల రామాలయ నిర్మాత, నేలకొండపల్లి వాసి


నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌లో దొరికిన విగ్రహం

అయిన భక్త రామదాసుగా పేరెన్నిక గన్నకంచర్ల గోపన్నది అవడానికి ఎక్కువ అవకాశాలున్నాయంటున్నారు. ఇప్పటి వరకు రామదాసు ఎలా ఉండేవాడు? ఆయన ఆహార్యం ఏమిటి అనేది మిస్టరీగానే ఉందని, ఈ నేపథ్యంలో కళాకారుల ఊహల మేరకు ఇప్పటి వరకు అనేక రూపాల్లో రామదాసు విగ్రహాలను తయారు చేసుకున్నామన్నారు. ఇక పోలీస్‌స్టేషన్‌లో దొరికిన విగ్రహం 16శతాబ్దం నాటిది అయి ఉంటుందని, రామదాసు విగ్రహం అవడానికి ఎక్కువ అవకాశాలున్నాయంటున్నారు.

ధ్యాన మందిరానికి విగ్రహం

నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌లో దొరికిన పురాతన విగ్రహాన్ని శుక్రవారం రామదాసు ధ్యాన మందిరానికి తరలించారు. రామదాసు పదో తరం వారసుడైన కంచర్ల శ్రీనివాసరావు సమక్షంలో ఆ విగ్రహాన్ని ధ్యాన మందిరంలో ఉంచి క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విగ్రహం రామదాసుదేనని భావిస్తున్నామని, దీనిపై ఓ నిర్ధారణకు రావాల్సి ఉందన్నారు.

రుణ విమోచన చట్టాన్ని అమలు చేయాలి

» పంటలకు మద్దతు ధర కల్పించాలి » కార్మిక హక్కుల్ని పరిరక్షించాలి » వామపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో ఖమ్మంలో ర్యాలీ

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి 26: కేంద్ర ప్రభుత్వం తక్షణమే రుణ విమోచన చట్టాన్ని అమలు చేయాలని, రైతుల పంటలకు మద్దతు ధర కల్పించాలని, కార్మికుల హక్కుల్ని పరిరక్షించాలని వామపక్ష రైతు సంఘాలైన సంయుక్త కిసాన్‌మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. సంయుక్త కిషాన్ మోర్చా జాతీయ పిలుపులో బాగంగా వామపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మంలోని నయాబజార్ నుంచి శ్రీశ్రీ విగ్రహం వరకు ట్రాక్టర్లు, ద్వీ చక్ర వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు మాట్లాడుతూ పదేళ్ల కేంద్ర ప్రభుత్వ పరిపాలనలో వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మార్చారని ఆరోపించారు. దశల వారీగా వ్యవసాయ రంగాన్ని ప్రభుత్వమే దెబ్బతీసిందన్నారు. దశాబ్దాల పాటు కార్మికులు సాధించుకున్న హక్కుల్ని కార్మిక చట్టాలు రద్దు చేయటం ద్వారా కార్మికులు హక్కుల్ని కోల్పోయారని ఆరోపించారు. దేశ సంపదను ఆదాని, అంబానీలకు తాకట్టు పెట్టిన ప్రధానమంత్రి వ్యవసాయరంగాన్ని కార్పొరేట్‌శక్తుల చేతిల్లోకి పంపే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. పరోక్షంగా తిరిగి వ్యవసాయ నల్ల చట్టాలను అమలు చేసే కార్యచరణ బీజేపీ ప్రభుత్వం చేస్తుందన్నారు. విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేసుకుంటామని ఇచ్చిన హామిని నేటి వరకు అమలు చేయలేదన్నారు. 2006అటవీహక్కుల



చట్టాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఎంఎల్ నాయకులు వీ కోటేశ్వరరావు, బందెల వెంకయ్య, దొండపాటి రమేశ్, ఆవుల వెంకటేశ్వర్లు, బొంతు రాంబాబు, శింగు నర్సింహారావు, కళ్యాణం వెంకటేశ్వరరావు, జీ రామయ్య, తోట రామాంజనేయులు, రావి శివరామకృష్ణ, తాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కొవిడ్ బాధిత కుటుంబానికి రూ.15లక్షల చెక్కు అందజేత

సత్తుపల్లిరూరల్, జనవరి 26: సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో కాంట్రాక్టు వర్కర్‌గా పనిచేస్తున్న మోరంపూడి రమేష్ కొవిడ్‌తో మృతిచెందగా ఆయన కుటుంబానికి మంజూరైన రూ.15లక్షల చెక్కును పీవో ఎస్.వెంకటాచారి శుక్రవారం ప్రాజెక్టు ఆఫీస్ వద్ద అందజేశారు. కోవిడ్ సమయంలో రమేష్ చనిపోగా ఆయన భార్య లక్ష్మీ రూ.15లక్షల చెక్కును అందుకోగా ఆమె సింగరేణి యాజమాన్యానికి, కృషిచేసిన పీవోకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. సంస్థలో పనిచేసే ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు ఉద్యోగులకు ఎక్‌గ్రేషియ కింద సంస్థ ఆదుకుంటుం దని పీవో చెప్పారు. కార్యక్రమంలో సింగరేణి అధికారులు లక్ష్మణమూర్తి, పీ.నరసింహారావు, దుర్గాప్రసాద్‌రావు, దేవదాస్, జీ.నర్సింహారావు, ఎన్.రామారావులు పాల్గొన్నారు.


చెక్కు అందిస్తున్న జేవీఆర్ ఓసీ పీవో

మార్కెట్ కార్యదర్శిగా ప్రవీణ్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

ఖమ్మం మార్కెట్ జనవరి 26: ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శిగా పి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం హైదరాబాద్ లోని పఠాన్‌చెరు మార్కెట్ కార్యదర్శిగా ఉన్న ప్రవీణ్‌రెడ్డిని రాష్ట్ర మార్కెటిం గ్ శాఖ ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు 'అదర్ డ్యూటీ'పై కార్యదర్శిగా నియమించగా ఆయన వెంటనే బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన ప్రవీణ్‌రెడ్డికు జిల్లా మార్కెటింగ్ శాఖ ఉద్యోగుల సంఘం, మా ర్కెట్ సిబ్బంది, వ్యాపారులు శుభాకాంక్షలు తెలిపారు.



సౌత్‌ఇండియా సైన్స్ ఫెయిర్‌కు భద్రాద్రి నమూనాలు

లక్ష్మీదేవిపల్లి, జనవరి 26: విజయవాడలో ఈనెల 28 నుంచి 30 వరకు జరిగే సైన్స్‌ఫేయిర్ పో టీలకు భద్రాద్రి జిల్లా నుంచి నాలుగు ఎగ్జిబిట్స్ ఎంపికయ్యాయని, ఇదే ప్రథమమని డీఈవో ఎం.వెంకటేశ్వరచారి తెలిపారు. ఈనెల 24, 25 తేదీలలో రంగారెడ్డి జిల్లాలో జరిగిన ఆన్‌లైన్ రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేయిర్ పోటీలలో మొత్తం 25 ఎగ్జిబిట్స్‌కు సౌత్‌ఇండియ పోటీలకు ఎంపికచేయగా వాటిలో నాలుగు ఎగ్జిబిట్స్ ఎంపికయ్యారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా చరిత్రలో సౌత్ ఇండియ పోటీలకు ఎంపిక కావడం ఇదే ప్రథమం. ఈనెల 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జిల్లా స్థాయి సైన్సు ఫేయిర్ (ఆన్‌లైన్)లో 10ఎగ్జిబిట్స్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరిగింది. వీటిలో నాలుగు ప్రాజెక్టులు సౌత్ ఇండియా పోటీలకు ఎంపికయ్యాయి.

ఎంపికైన ప్రాజెక్టులు..

● ఇల్లెందు సింగరేణి పాఠశాలకు చెందిన టి.వరుణ్‌కుమార్ (9వతరగతి) రూపొందించిన 'స్మార్ట్ అగ్రీ రోబో'.

● కొత్తగూడెంలోని త్రివేణి పాఠశాల విద్యార్థిని బి.దీప్తిక(9వ తరగతి) రూపోందించిన 'లిక్విడ్ ట్రీస్ అండ్ బయో ఎంజామ్'.

» ఉమ్మడి జిల్లాలో ప్రథమం: డీఈవో వెంకటేశ్వరచారి

● భద్రాచలం గీతం మోడల్ స్కూల్‌కు చెందిన జి.చరితశ్రీ (9వ తరగతి) రూపొందించిన 'హిమోడయలసిస్ వర్కింగ్ మోడల్' ఎంపికైంది.

● చంద్రుగొండ జిల్లాపరిషత్‌స్కూల్ విద్యార్థి ఎ.రామచరణ్ రూపొందించిన 'స్మార్ట్‌మెల్మెట్' అనే ఎగ్జిబిట్ ఎంపికైంది.

గైడ్ టీచర్స్‌గా ఎం.విష్ణుప్రియా, పి.జ్యోతి, కె.జ్యోతి, ఎండి వాజీద్‌లు వ్యవహరించారు.

నేటిసాయంత్రం రిపోర్టు చేయాలి

డీఎస్‌వో చలపతిరాజు

సౌత్ ఇండియా సైన్స్ ఫేయిర్‌కు ఎంపికైన విద్యార్థులు శనివారం సాయంత్రంలోగా విజయవాడలోని మురళీ కన్వెన్షన్ సెంటర్‌లో రిజిస్ట్రేషన్ చేయాలి. ప్రాజెక్టులను తమ వెంటతీసుకొని వెళ్లాల్సి ఉంటుందని వివరాల కోసం 9247296011 ను సంప్రదించాలని డీఎస్ఓ చలపతి రాజు కోరారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను కలెక్టర్, అదనపు కలెక్టర్, డీఈఓ, డీఎస్ఓలు అభినందించారు.

ఉత్సాహంగా రాజీవ్ ట్రోఫీ క్రికెట్ పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 26: ఖమ్మంనగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో రెండు రోజులుగా జరుగుతున్న రాజీవ్‌గాంధీ మెమోరియల్ రాజీవ్ ట్రోఫీ ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం పోటీలను కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్, డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. రెండవరోజు జరిగిన మొదటి మ్యాచ్‌లో ఖమ్మం అర్బన్ మండలం జట్టు రఘునాధపాలెం మండలం జట్టుపై 5 పరుగుల తేడాతో విజయం సాధించింది. రెండవ మ్యాచ్‌లో తిరుమలాయపాలెం జట్టుపై తల్లాడ జట్టు విజయం సాధించింది. పోటీలను నిర్వాహకులు మతిన్ సమీక్షించారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న తుమ్మల యుగంధర్

డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి

మధిరటౌన్, జనవరి 26: మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు పూర్వ విద్యార్థి సంఘం తెలియచేసింది. శుక్రవారం కళాశాలలో ప్రిన్సిపాల్ శాస్త్రి అధ్యక్షతన కళాశాల అధ్యాపకులు, పూర్వ విద్యార్థుల సంఘం సభ్యుల తో జరిగిన సమావేశంలో కళాశాల అభివృద్ధికి తీసుకోవలసిన చర్యల గురించి చర్చించారు. కళాశాలకు కావల్సిన అదనపు తరగతి గదులు, సైన్స్ సెక్షన్ల పునఃప్రారంబం, ఇతర మౌలిక సదుపాయాలు నెలకొల్పేందుకు ప్రభుత్వ దృష్టికి తీసుకుపోయే సాధించేలా కృషి చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవి కుమార్, అధ్యాపకులు అరుణ, ఇందిర, వీరన్న పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు నాగేశ్వరరావు, జమీర్, ఉపాధ్యక్షులు పాగి బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రసాంకేతిక రంగాల పురోగతి 'సృజనోత్సవ్'

ఖమ్మం రూరల్, జనవరి 26: సైన్స్, టెక్నాలజీ ఈ రోజు ప్రపంచ గమనాన్ని మార్చే దిశగా మన ముందుకు వచ్చాయని తాద్వారా అన్ని రంగాల్లో ఉత్పాదకశక్తిని పెంచి విశ్వమానవళి అవసరాలు తీర్చాలని ఆ దిశగా పరిశోధనలు సాగాల్సిన అవసరం ఉందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మల్లెంపాటి వీరభద్రరావు అన్నారు. మండల పరిధిలోని పెద్దతండాలోని ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న ప్రియదర్శిని విద్యాసంస్థల 'సృజనోత్సవ్-2024 టెక్నో, కల్చర్ ఫెస్ట్‌ను శుక్రవారం ప్రారంభించారు. విద్యార్థులు రూపొందించిన వివిధ ప్రయోగాలను, ప్రాజెక్టులను తిలకించారు. విద్యాసంస్థల అధినేత కాటేపల్లి నవీన్‌బాబు మాట్లాడుతు రెండు దశాబ్ధాలుగా విద్యార్థుల సమగ్రాభివృద్ధే ధ్యేయంగా విద్యాసంస్థలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాలుగు జిల్లాల నుండి వివిధ కళాశాలల నుండి విద్యార్థులు భారీగా హజరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సృజనోత్సవ్ కన్వీనర్ అట్లూరి వెంకటరమణ, కో ఆర్డినేటర్ శివకుమార్, ప్రిన్సిపల్ గోపాల్, డిగ్రీ కలాశాల ప్రిన్సిపల్ రామారావు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

బాధిత కుటుబాలకు ఎంపీ నామ పరామర్శ


జడ్పీటీసీని పరామర్శిస్తున్న ఎంపీ నామ

వైరా, జనవరి26: వైరా మండలంలోని పలు బాధిత కుటుంబాలను ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు గురువారం రాత్రి పరామర్శించారు. ఇటీవల భర్తను కోల్పోయిన వైరా జడ్పీటీసీ నంబూరి కనకదుర్గను పరామర్శించారు. అలాగే సిరిపురం, విప్పలమడక, లింగన్నపాలెం, గరికపాడు గ్రామాల్లోని పలు బాధిత కుటుంబాలను పరామర్శించి సానుభూతి తెలిపారు. బీఆర్‌ఎస్ మండల కమిటీ అధ్యక్షుడు బాణాల వెంకటేశ్వరరావు, జడ్పీకోఆప్షన్ సభ్యుడు షేక్. లాల్ మహ్మద్, సిరిపురం ఎంపీటీసీ మట్టూరి కృష్ణారావు, నాయకులు మోరంపూడి ప్రసాద్, బాబురావు, వాసిరెడ్డి రవికుమార్, పరుచూరి రామారావు, శెట్టిపల్లి శ్రీనివాసరావు, ఐనాల కనకరత్నం, పూసలపాడు సొసైటీ అధ్యక్షుడు గాలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎకరానికి రూ.8లక్షల పరిహారం ఇవ్వాలి

» తాజా భూసేకరణ చట్టం ప్రకారం చెల్లించాలి » నీటిపారుదల అధికారులతో బాధిత రైతులు

అశ్వారావుపేట రూరల్, జనవరి 26: వరదకాలువ కింద భూములు కోల్పోయిన తమకు తాజా భూసేకరణ చట్టం ప్రకారం ఎకరానికి రూ.8లక్షల పరిహారం అందించాలని, కొంతమంది భూములను రీసర్వే చేయాలని వెంకమ్మ వరద కాలువ కింద భూమిని కోల్పోయిన గిరిజన రైతులు నీటిపారుదలశాఖ అధికారులను కోరారు. మండలంలో 2005లో ప్రారంభమైన వెంకమ్మ చెరువు వరద కాలువ నిర్మాణం ద్వారా జరిగిన భూసేకరణకు సంబంధించి ఇప్పటికీ పరిహారం పూర్తికాలేదు. అయితే గతంలో ఎకరానికి రూ.1.35లక్షల చొప్పున ఇస్తూ ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. 72 ఎకరాలకు సంబంధించిన పరిహారం జిల్లా అధికారుల ఖాతాల్లో నిల్వ ఉన్నాయి. అయితే ఆ పరిహారాన్ని తీసుకునేందుకు బాధిత రైతులు అంగీకరించటంలేదు. ఈనేపథ్యంలో శుక్రవారం మల్లాయిగూడెంలో నీటిపారుదలశాఖ ఈఈ సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో రామన్నగూడెం, మల్లాయిగూడెం, వినాయకపురం, వేదాంతపురం, ఊట్లపల్లి ఇలా ఆరు పంచాయతీల పరిధిలో ఉన్న రైతులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను పరిహారంగా తీసుకోవాలని అధికారులు సూచించారు. అయితే బాదిత రైతులు ఆ పరిహారం తమకు అవసరం లేదని, పెరిగిన ధరల ప్రకారం ఎకరానికి రూ.8లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విలువైన భూములు కోల్పోయామని, పరిహారం తక్కువ ఎలా తీసుకుంటామని ప్రశ్నించారు. దీంతో పాటు కొందరి భూముల సర్వేలో తప్పులు జరిగాయి, పేర్లు కూడా తప్పుగా వచ్చాయని, వాటిని కూడా సరిచేయాలని కోరారు. దీనికి స్పందించిన అధికారులు పంచాయతీల వారీగా తీర్మానాలు చేసి ఇవ్వాలని, వాటిని ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఈఈ కృష్ణ, ఏఈ కృష్ణ, పంచాయతీ సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.


గిరిజన రైతులతో సమావేశమైన నీటిపారుదల శాఖ అధికారులు

రేపు ఖమ్మంలో 'అక్షరాల తోవ' బహుమతి ప్రదానోత్సవ సభ

ఖమ్మం సాంస్కృతికం జనవరి 26: అక్షరాల తోవ సాహితీ సంస్థ బహుమతుల ప్రదానోత్సవ సభ ఆదివారం ఉదయం 10 గంటలకు ఖమ్మంలోని రిక్కాబజార్ హైస్కూల్‌లో జరుగుతుందని నిర్వాహకులు నామా పురుషోత్తం, దాసరోజు శ్రీనివాస్, రాచమళ్ల ఉపేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జాతీయ స్దాయిలో నిర్వహించిన కథల పోటీల్లో విజేతలతోపాటు ఆన్‌లైన్‌లో నిర్వహించిన కవితల పోటీల్లో విజేతలకు బహుమతులు, కథలు, కవితలతో ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాహిత్య అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

చిన్న తిరుపతికి సాయిభక్తుల పాదయాత్ర

అశ్వారావుపేట రూరల్, జనవరి 26: అశ్వారావుపేటలోని జంగారెడ్డిగూడెం రోడ్‌లో గల షిర్డీసాయిబాబా ఆలయ సేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం 50మంది సాయిబాబా భక్తులు ఆంధ్రాలోని చిన్న తిరుపతిగా పేరుగాంచిన ద్వారకా తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజల అనంతరం వెంకన్నసన్నిధిగా పాదయాత్రను చేపట్టారు. ఆలయం తరపున వరుసగా 9వ సారి యాత్రను చేపట్టారు. 60 కిలోమీటర్ల పాదయాత్ర ద్వారా ద్వారకా తిరుమలకు శనివారం చేరుకుని మొక్కులు చెల్లిస్తారు. కార్యక్రమంలో ఆలయ సేవాసమితి అధ్యక్షులు హరి, అప్పారావు, శ్రీనివాసరావు, పృథ్వి, రమాదేవి, జ్యోతి, స్వప్న, లక్ష్మీ, వెంకటేశ్వరావు, సంజుతో పాటు పలువురు ఉన్నారు.

షాదీఖానా నిర్మాణం పూర్తికి ప్రతిపాదనలు

» రూ.36 లక్షలు విడుదల చేయాలని ప్రభుత్వానికి ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ వినతి

వైరా, జనవరి 26: వైరాలో అసంపూర్తిగా ఉన్న షాదీఖానా నిర్మాణం కోసం రూ.36 లక్షల నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ తెలిపారు. శుక్రవారం మస్జిద్ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు. ఆనంతరం అసంపూర్తిగా ఉన్న షాదీఖానాను ఎమ్మెల్యే పరిశీలించారు. అక్కడి నుంచే పీఆర్ డీఈ వెంకటరెడ్డికి ఫోన్ చేసి పరిస్థితిని సమీక్షించారు. షాదీఖానా నిర్మాణం పూర్తి చేసేందుకు అవసరమైన రూ. 36 లక్షల నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని ఎమ్మెల్యే మస్జిద్ కమిటీకి తెలిపారు. ముస్లింలకు అండగా ఉంటానని ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హమీ ఇచ్చారు. అంతకు ముందు ఎమ్మెల్యే కాంగ్రెస్ కార్యాలయంలో, క్రాస్ రోడ్డు వద్ద జాతీయ పతకాలను ఎగురవేశారు. ప్రభుత్వ హైస్కూల్‌లో క్రీడాల విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, నాయకులు కట్ల రంగారావు, రాంపూడి రోశయ్య, దొడ్డా పుల్లయ్య, పణితి సైదులు, శ్రీను, మిట్టపల్లి నాగి, చెరుకూరి కిరణ్, కట్ల సంతోష్ శీలం నాగిరెడ్డి, పఠాన్ జాన్, దార్నా రాజశేఖర్, పాలేటి నర్సింహారావు, బత్తుల గీత, బొళ్ల గంగరావు పాల్గొన్నారు.


అసంపూర్తిగా ఉన్న షాదీఖానాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

రిజర్వ్ ఫారెస్ట్ భూమిలో అక్రమ నిర్మాణంపై డీఎఫ్‌వో చర్యలు

● ఆక్రమణదారుడిపై కేసు నమోదు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పాల్వంచ, జనవరి 26: రిజర్వ్ పారెస్ట్ భూమిలో అక్రమంగా భవనాన్ని నిర్మించిన వ్యక్తిపై అటవీశాఖ ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు. అటవీ భూమిలో అక్రమం పేరుతో ఈ నెల 18న ఆంధ్రజ్యోతిలో వెలువడిన వార్తకు ఉన్నతాధికారులు స్పందించారు. రిజర్వ్ ఫారెస్ట్ భూమిని ఆక్రమించుకుని గుడి పేరుతో భవనాన్ని నిర్మించిన వ్యక్తిపై అధికారులు డీఎఫ్ఓ కృష్ణాగౌడ్ ఆదేశాలతో కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. శుక్రవారం డీఎఫ్ఓ స్వయంగా పాల్వంచ వనమా కాలనీ శివారు ప్రాంతాన్ని సందర్శించారు. అక్రమంగా నిర్మించిన గుడిని పరిశీలించారు. అక్రమణ దారులు అవలంభిస్తున్న విధానాలను గూర్చి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గుట్ట ప్రాంతంలో భవిష్యత్తులో ఎటువంటి ఆక్రమణలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని, రిజర్వ్ పారెస్ట్ ప్రాంతంలో ట్రెంచ్ ఏర్పాటు చేయాలని ఎఫ్‌డీఓ దామోదరరెడ్డిని ఆదేశించారు. ఆయన వెంట రేంజి అధికారి అనీల్, డీఆర్ఓ సుజాత, బీట్ ఆఫీసర్ అశోక్ ఉన్నారు.


అక్రమ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్‌వో కృష్ణాగౌడ్

తేనెటీగల దాడిలో వృద్ధురాలి మృతి

దుమ్ముగూడెం, జనవరి 26 : తేనెటీగల దాడిలో ఓ వృద్ధురాలు మృతిచెందిన సంఘటన భద్రాద్రికొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం కోయనరసాపురంలో శుక్రవారం జరిగింది. కోయనర్సాపురానికి చెందిన వర్సా రాజమ్మ(60) తన పొలంలో పత్తి తీసేందుకు గాను శుక్రవారం మధ్యాహ్నం ఒంటరిగా వెళ్లింది. ఆ సమయంలో ఆమెపై తేనెటీగలు దాడి చేయడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో పొలం వద్దకు వెళ్లిన కుటుంబసభ్యులు అపస్మారకస్థితిలో కనిపించిన రాజమ్మను భద్రాచలం ఆసుపత్రికి తరలిస్తుండగా పరిస్థితి విషమించి మార్గమధ్యలో మృతిచెందింది. దీంతో కోయనరసాపురంలో విషాదం అలముకుంది.

షార్ట్ సర్క్యూట్‌తో కిరాణాదుకాణం దగ్ధం

ఆళ్లపల్లి/కల్లూరు, జనవరి 26: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఆళ్లపల్లి మండలం కేంద్రంలో ఓ కిరాణషాప్ శుక్రవారం తెల్లవారుజామున దగ్ధమైంది. ఆళ్లపల్లి గ్రామానికి చెందిన నరెడ్ల ప్రవీణ్ కొంత కాలంగా కిరాణదుకాణం పెట్టుకుని జీవిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి మంటల అంటుకున్నాయి. దుకాణంలోన్న వస్తువులతో పాటు రెండు ఫ్రిజ్‌లు, జిరాక్స్ మిషన్, కొంత నగదు పూర్తిగా కాలీబూడిద అయింది. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ ఏఈ రమేష్ జరిగిన నష్టాన్ని పరిశీలించారు.

మర్లపాడులో రెండు ఇళ్లు..

కల్లూరు: మండలంలోని మర్లపాడులో శుక్రవారం విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంబంవించి రెండు ఇళ్లు దగ్ధం మయ్యాయి. సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం జరిగింది. మర్లపాడుకి చెందిన మేడేపల్లి వెంకమ్మ, గర్నపూడి రామకోటిలకు చెందిన రెండు ఇళ్లు షార్టు సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో కుటుంబ సభ్యులు కూలి పనులకు వెళ్లారు. ఫైర్ ఇంజన్ సంఘటన స్థలానికి చేరుకునేలోగా పూరిగ్గా నష్టం జరిగింది. తహసీల్దార్‌కు సమాచారం అందించటంతో క్షేత్ర స్థాయిలలో ఆర్ఐ స్టాలిన్‌ను పంపగా పంచానామా చేసి బాధితులకు సగటున 25 కిలోల బియ్యంఅందజేశారు. సంఘటనపై ప్రభుత్వానికి నివేదిక పంపించారు.

ఆరు ఇసుకట్రాక్టర్లు సీజ్

ఖమ్మంరూరల్, జనవరి 26: అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను పోలీసులు శుక్రవారం మండల పరిదిలోని కోదాడ క్రాస్‌రోడ్డులో సీజ్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎటువంటి అనుమతులు లేకుండా ముదిగొండ మండలం గంధసిరి నుండి ఆరు ఇసుక ట్రాక్టర్లు ఖమ్మం వైపు వెలుతున్నాయి. మార్గం మధ్యలో కోదాడ క్రాస్ రోడ్డులో వాటిని పట్టుకుని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఇల్లెందురూరల్, జనవరి 26: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన ఇల్లెందు మండల, కుమ్మరికుంట వద్ద శుక్రవారం జరిగింది. ఇల్లెందు పోలీస్ ఎస్ఐ అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం మహబూబా బాద్ జిల్లా, పాఖాలకొత్తగూడెం మండ లం, కృష్ణాపురం గ్రామానికి చెందిన ఇర్ప రఘు(28) తన ద్విచక్రవాహంపై గురువారం ఇల్లెందు మండలం, మొండితోగు గ్రామానికి వచ్చి, శుక్రవారం తిరిగి తన స్వగ్రామానికి (కృష్ణాపురం) వెళ్తున్న క్రమంలో అదుపుతప్పి చెట్టును ఢీ కొనడంతో రఘు అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ అప్పారావు తెలిపారు. ఈ ఘటనపై ఇర్ప రఘు భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బీఆర్‌ఎస్ నేత నున్నా రమణ అరెస్టు, రిమాండ్

తిరుమలాయపాలెం, జనవరి 26: మహబూబాబాద్ జిల్లా బీఆర్‌ఎస్ నేత నున్నా రమణను శుక్రవారం ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం పోలీసులు అరెస్టుచేసి కోర్టుకు రిమాండ్ చేశారు. శుక్రవారం ఉదయం తిరుమలాయపాలెం ఎస్ఐ శ్రీనివాస్, పోలీసు సిబ్బంది డోర్నకల్ మండలం ఉయ్యాలవాడలో రమణను అదుపులోకి తీసుకున్నారు. తిరుమలాయపాలెం మండలంలోని పిండిప్రోలు శివారు శివాలయం సమీపంలో నున్న రహనకు కొంత వ్యవసాయ భూమి ఉంది. 2021లో ఎలాంటి అనుమతులు లేకుండా ఆ భూమిలో ఉన్న పెద్దపెద్దరాళ్లను తొలిగించేందుకు జిలిటెన్ స్టిక్స్ లాంటి పేలుడు పదార్థాలను ఉపయోగించగా.. 2021జూన్‌లో నున్నా రమణ సహా ఏడుగురిపై కేసు నమోదుచేశారు. వీరిలో ఆరుగురిని గతంలోనే అరెస్టు చేయగా.. ఏ1గా ఉన్న నున్న రమణ పోలీసులకు దొరక్కుండా తిరుగుతు న్నాడు. పోలీసులు పలుమార్లు పోలీసుస్టేషన్ రమ్మని సమాచా రం పంపినా స్పందించడంలేదు. దీంతో ఎస్ఐ శ్రీనివాస్, తన సిబ్బందితో కలిసి శుక్రవారం ఉయ్యాలవా డ వెళ్లి తన నివాసంలో ఉన్న రమణను అరెస్టుచేసి కోర్టుకు రిమాండ్ పంపారు.

జెండా పైపు తొలగింపుతో వివాదం

భద్రాచలం జనవరి 26: భద్రాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జాతీయ జెండా ఎగరవేసే దిమ్మెపై ఉన్న ఐరన్ పైపు తొలగింపు పట్ల విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. శుక్రవారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించు కొని కళాశాల క్రీడా మైదానంలో ప్రతినిత్యం వాకింగ్, వ్యాయా మం నిర్వహించే వ్యక్తులు, క్రీడాకారులు జాతీయ పతాకాన్ని ఎగరవేసేందుకు సిద్ధమయ్యారు. దీంతో విషయం తెలుసుకున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల అధికారులు ఆ ప్రాంతంలో ఒక నోటీసును ఏర్పాటు చేశారు. ఈ మైదానం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందినదని ఈ క్రమంలో ఎవరికి జాతీయ జెండాను ఆవిష్కరించేందుకు అనుమతి లేదని అతిక్రమించిన వారు చట్టరీత్యా శిక్షారు లు అవుతారని ఆ నోటీసులో పేర్కొన్నారు. ఇదే సమయంలో జెండా దిమ్మెకు ఉన్న జాతీయ జెండాను ఎగరవేసే ఇనుప పైపును సైతం తొలగించారు. దీంతో ప్రతిసారి స్వాతంత్ర, గణతంత్ర దినోత్సవాలను జరుపుకుంటున్న తమకు ఎంతో ఆవేదనగా ఉందని పలువురు వాకర్లు తెలిపారు. స్వాతంత్ర, గణతంత్ర దినోత్సవాలు ప్రజల్లో దేశభక్తిని, జాతీయతా భావాన్ని పెంచేవని అటువంటి కార్యక్రమాల్లో అందరూ పాల్గొనాల్సి ఉండగా అధికారులు ఈ రీతిన వ్యవహరించడం తమను ఎంతో ఆవేదనకు గురి చేసిందని వారు వాపోతున్నారు. ఒకవేళ ఇక్కడ జాతీయ జెండాను కళాశాల అధికారులే ఆవిష్కరించే అధికారం ఉంటే వారు చేసినా బాగుండేదని అభిప్రాయపడ్డారు. దిమ్మ పైన ఉన్న ఇనుప పైపు కూడా తొలగించడం సమంజసంగా లేదని పేర్కొన్నారు. ఈ విషయమై కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణిని 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా కళాశాల మైదానంలో అనుమతి, సమాచారం లేకుండా జెండా ఆవిష్కరణలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ క్రమంలో వాకర్స్, క్రీడాకారులతో మాట్లాడిన వారు తమకు సమాచారం ఇవ్వకుండానే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అందుచేతనే జెండా దిమ్మపై ఉన్న పైపును తొలగించి నోటీసు అంటించామన్నారు.

కత్తితో యువకుడు హల్‌చల్

ఖమ్మం క్రైం జనవరి 26: కత్తితో ఓ యువకడు హల్‌చల్ చేసిన సంఘటన శుక్రవారం రాత్రి ఖమ్మం నగరంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని మామిళ్లగూడెం ప్రాంతంలో ఉన్న ఓ ఫంక్షన్‌హాల్ సమీపంలో అదే ప్రాంతానికి చెందిన మహిళ శుక్రవారం రాత్రి సమయంలో నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా గుర్తుతెలియని ఓ యువకుడు అక్కడికివచ్చి మహిళను కత్తితో వెంబడించాడు. దీంతో ఆమె కేకలు వేయడంతో గమనించిన స్థానికులు వెంటనే ఆ యువకుడిని పట్టుకొని దేహశుద్దిచేసి టూటౌన్ పోలీసులకు అప్పగించారు. సదరు యుకకుని వద్ద గంజాయి పొట్లాలు కూడా లభించినట్లు స్థానికులు తెలిపారు.


ఖమ్మం పరేడ్ గ్రౌండ్‌లో పోలీసుల కవాతు


ఖమ్మంలో గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబిస్తున్న విద్యార్థుల ప్రదర్శన


ఖమ్మం కోర్టులో జెండా ఎగరేస్తున్న జిల్లా జడ్జి


ఖమ్మంలో జెండా వందనం వేడుకల్లో సీపీ సునీల్‌దత్

అంబరాన్నంటిన త్రివర్ణసంబురం

ఇరుజిల్లాల్లో గణతంత్ర వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సమీకృత కలెక్టరేట్ భవనాల్లో ఆయా జిల్లాల కలెక్టర్లు జాతీయ జెండాను ఆవిష్కరించి అనంతరం వందనం సమర్పణ చేశారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక, జానపద నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు హాజరయ్యారు.


చిన్నారులను ముద్దు చేస్తున్న ఖమ్మం కలెక్టర్, సీపీ


ఖమ్మం జడ్పీలో జెండా ఎగరేస్తున్న సీఈవో


మహిళల స్టాల్‌ను పరిశీలిస్తున్న ఖమ్మం కలెక్టర్ గౌతమ్



మొక్కలతో పద్మశ్రీ గ్రహీత వనజీవి రామయ్య



భద్రాచలం ఈవో కార్యాలయంలో..


ఖమ్మంలో ఆకట్టుకున్న మహాలక్ష్మి శకటం


స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తున్న సీపీ సునీల్‌దత్


జెండా వందనం వేడుకల్లో కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజ్



స్త్రీ-శిశు సంక్షేమ శాఖ శకటం



మైనార్టీ, గురుకుల శాఖల శకటాలు


ఖమ్మంలో విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్


సత్తుపల్లి పురపాలక కార్యాలయ ఆవరణలో రెపరెపలాడుతున్న భారీ మువ్వన్నెల పతాకం


బీటీపీఎస్‌లో జెండా ఎగరేస్తున్న సీఈ బిచ్చన్న




గణతంత్ర వేడుకల్లో కలెక్టర్, సీపీ కుటుంబసభ్యులు


మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థుల ప్రదర్శన



చంద్రయాన్ ఇతివృత్తాన్ని వివరిస్తున్న విద్యార్థినులు


గొడుగుతో ఓ విద్యార్థిని నృత్య ప్రదర్శన

విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా బొగ్గు

» కార్మికుల సంక్షేమమే సంస్థ లక్ష్యం » గణతంత్ర వేడుకల్లో సింగరేణి సీఎండీ బలరాంనాయక్.. సెక్యూరిటీ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరణ

కొత్తగూడెం టౌన్, జనవరి 26: దేశంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ కనుగుణంగా సింగరేణి బొగ్గు అందిస్తాం. కార్మికుల సంక్షేమమే లక్ష్యమని సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం తెలిపారు. 75వ గణతంత్ర వేడుకల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని ప్రకాశం స్టేడియంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సింగరేణి సెక్యురిటీ సిబ్బంది నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం కార్మికులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ దేశంలోనే 20 థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గును సింగరేణి సరఫరా చేస్తోందన్నారు. మంచిర్యాల జిల్లా జైపూర్‌లో 1200ల మెగా వాట్ల విద్యుత్ ప్రాజెక్టు నిర్మించి రాష్ట్ర అవసరాలు తీర్చుతోందన్నారు. సింగరేణిలో నూతన ప్రాజెక్టుల ఏర్పాటు కోసం అవసరమైన చర్యలు తీసు కుంటున్నామని బలరాంనాయక్ తెలిపారు. సింగరేణి కార్మికుల వారసులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగ అవకాశాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. సింగరేణి కార్మికులు రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేసి సంస్థ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సింగరేణి సంస్థలో ఆధునిక యంత్రాలను వినియోగించేందుకు కార్మికులకు శిక్షణ ఇచ్చామన్నారు. యం త్రాలు 18 గంటలు పని చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ ఖర్చులను తగ్గించేందుకు రూ.500 కోట్ల వ్యయంతో 224 మెగా వాట్ల సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం సింగరేణి వ్యాప్తంగా మైన్స్, డిపార్ట్‌మెంట్‌లు, సింగరేణి ఖాళీ స్థలాల్లో మొక్కలు పెంచుతున్నట్లు తెలిపారు. అనంతరం



గణతంత్ర వేడుకల్లో మాట్లాడుతున్న సింగరేణి సీఎండీ

సింగరేణి సంస్థకు ఉత్తమ సేవలందిస్తున్న ఉద్యోగులు, కార్మికులను సన్మానించారు. సింగరేణి, ప్రభుత్వ, ప్రవేటు విద్యా సంస్థల విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, విన్యాసాలు అలరించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్(పా) ఎన్‌వికె.శ్రీనివాస్, డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ వెంకటేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్ (ఈఎన్‌ఎం) సత్యనారాయణరావు, జనరల్ మేనేజర్లు కె.బసవయ్య, సూర్యనారాయణ, వెంకటేశ్వరరావు, గురవయ్య, బిఆర్ దీక్షితులు, ఏఐటీయుసి ప్రధాన కార్యదర్శి కె.రాజ్‌కుమార్, ఐఎన్‌టీయుసీ ప్రధాన కార్యదర్శి త్యాగరాజన్, సీఎంవోఏఐ అధ్యక్షులు జక్కం రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కొత్తగూడెం ఏరియాలో ....

సింగరేణి కొత్తగూడెం ఏరియాలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. జనరల్ మేనేజర్ కార్యాలయంలో జీఎం షాలేమ్‌రాజు జాతీయ జెండాను ఆవిష్కరించారు. జయశంకర్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో సింగరేణి సెక్యూరిటీ సిబ్బందిచే గౌరవ వందనం స్వీకరించారు.


మహనీయుల వేషధారణలో విద్యార్థులు


సెక్యూరిటీ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న జీఎం

కార్యక్రమంలో ఏరియా సేవా అధ్యక్షురాలు మధురవాణి షాలే మ్‌రాజు, ఎస్‌వోటు జీఎం జివి.కోటిరెడ్డి, ఏరియా ఇంజనీర్ దుర్గాప్రసాద్, ఏజెంట్ రవీందర్, అధికారులు శివకేశవరావు, అచ్చుత్‌రామయ్య, పాలడుగు శ్రీనివాస్, మురళీ, రమణారెడ్డి, అనిల్, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రపంచానికి మన సంస్కృతీసంప్రదాయాలు ఆదర్శం

గిరిజనులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నాం .. 75వ గణతంత్ర వేడుకల్లో భద్రాచలం ఐటీడీఏ పీవో

భద్రాచలం, జనవరి 26: మహనీయుల ఆశయాలు, త్యాగాల స్ఫూర్తితో ప్రపంచ దేశాలకు మన సంస్కృతి సంప్రదాయాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ అన్నారు. 75వ గణతంత్ర వేడుకల సందర్భంగా శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో పీవో జాతీయ జెండా ను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజనులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని, విద్య, వైద్యం, ఇంజనీరింగు, వ్యవసాయం, మౌళిక వసతులు, సాగు నీరు తదితర రంగాల్లో సర్వతోముఖాభివృద్ధి సాధిస్తున్నామని పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాం గం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందని, త్యాగధనులు అల్లూరి సీతారామరాజు, కొమరం భీం వంటి వారిని మనం స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలో ఐటీడీఏ ద్వార నాలుగు జిల్లాలోని గిరిజనులకు సేవలందిస్తున్నామని, ముఖ్యం గా విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టిసారించామని పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి గిరిజన క్రీడల్లో భద్రాచలం జోన్ రెండో స్థానంలో నిలిచిందన్నారు. గత ఏడాది పదో తరగతి ఫలితాల్లో 75 శాతం సాధించగా ఈ ఏడాది వందశాతం ఫలితాల సాధనకు ప్రత్యేక ప్రణాళికతో కృషి చేస్తున్నామని తెలిపారు. ట్రైకార్ ద్వార రూ.9.47 కోట్ల రుణాలను మంజూరు చేశామని, అలాగే 4,365 యూనిట్లకు గాను సబ్సిడీ కింద రూ.35.32 కోట్లు మంజూరు చేశామని, గిరి వికాసం ద్వార రూ.27.23 కోట్లతో 3,128 మంది రైతులకు బోర్‌వెల్స్ ఏర్పాటు చేసి 9,564 ఎకరాలను సాగులోకి తెచ్చామన్నారు. ఇంజనీరింగ్ శాఖ ద్వారా రూ.7.15కోట్ల విలువైన రోడ్లు, గ్రామ పంచాయతీ భవనాలు, ప్రహరీగోడలు, గురుకుల భవనాలు వివిధ దశల్లో ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే ఆర్వోఎఫ్ ఆర్ ద్వారా 2,21,054 ఎకరాలకు అటవీహక్కు పత్రాలు అందజేశామని తెలిపారు.


కిందనే కూర్చుని విద్యార్థుల ప్రదర్శనలు తిలకిస్తున్న ఐటీడీఏ పీవో


మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

నేలపై కూర్చొని కళా ప్రదర్శనలు తిలకించిన పీవో

ఐఏఎస్ అధికారి హోదాలో ఉన్న పీవో ప్రతీక్‌జైన్ రిపబ్లిక్ డే వేడుకలను వేదిక ఎదురుగా ఉన్న నేలపైనే కూ ర్చొని తిలకించారు. కుర్చీలన్నీ తీసివేయించి నేలపైనే కూ ర్చొని తనతో పాటు తన సతీమణితో పాటు అధికారులందరూ నేలపైనే కూర్చొని కార్యక్రమాలను తిలకించారు.

కాంగ్రెస్ నాయకుల బాహాబాహీ

తల్లాడ, జనవరి 26: తల్లాడలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు బాహాబాహీకి దిగారు. స్థానిక రింగ్‌రోడ్డు సెంటర్లో గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు కోసూరి వెంకటేశ్వరరావు(కేవీ), షేక్.జమాల్ మధ్య వాట్సాప్ మెసేజ్‌ల విషయంలో మాటమాటా పెరిగి తోపులాట జరిగింది. తిరిగి ఇదే విషయమై మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుధాకర్, నాయకుడు గోపిశెట్టి వెంకటేశ్వర్లు వాగ్వాదానికి దిగారు. ఈ విషయమై తల్లాడ పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాల వారు ఫిర్యాదులు చేసుకున్నారు.


బాహాబాహీకి దిగిన కాంగ్రెస్ శ్రేణులు

బోనకల్-ఖమ్మం రోడ్డుకు మరమ్మతులు

చింతకాని, జనవరి 26: ఖమ్మం-బోనకల్ రోడ్డు పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. రూ 4.5 కోట్లతో చేప ట్టనున్న మరమ్మతు పనులను శుక్రవారం ప్రారంభించారు. రోడ్డు మరమ్మతులను ఎంపీపీ కోపూరి పూర్ణయ్య పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని సూచిం చారు. కార్యక్రమంలో ఏఈ లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.


మరమ్మతులు నిర్వహిస్తున్న సిబ్బంది

ఏఐటీయూసీ జాతీయ సమితి సభ్యుడికి సతీ వియోగం

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి 26: రాష్ట్ర సహకార బ్యాంకు ఉద్యోగుల సంఘం(ఏఐటీయూసీ) జాతీయ సమితి సభ్యుడు కనకం జనార్దన్ భార్య శారద(74) అనారోగ్యంతో శుక్రవారం ఖమ్మంలోని స్వగృహంలో కన్నుమూశారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ నాగభూషయ్య, సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమం తరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, మేయర్ నీరజ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర అధ్యక్షుడు ఎండీ జావీద్ జనార్దన్‌ను పరామర్శించారు.

వారంలో బస్టాండ్ సుందరీకరణ: ఎమ్మెల్యే

చంద్రుగొండ, జనవరి 26: సమస్యలకు నిలయంగా ఉన్న చంద్రుగొండ బస్సుస్టాండ్‌ను వారంలో అభివృద్ధిచేసి సుందరీకరణ చేస్తామని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. చంద్రుగొండ బస్సుస్టాండును పరిశీలించారు. గత కొన్ని సంవత్సరాల నుంచి బస్సు స్టాండును ఆర్టీసీ అధికారులు పట్టించుకోక పోవటంతో భవనం శిధిలావస్థకు చేరుకోకుంది. అదేవిధంగా వ్యర్థాలతో ప్రాంగణం అపరిశుభ్రంగా ఉంది. బస్సు స్టాండ్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడారు.



బస్టాండ్‌లో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ముచ్చన్నెల రెపరెపలు..

జిల్లాలో ఘనంగా గణతంత్ర వేడుకలు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

75వ గణతంత్ర దినోత్సవాన్ని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామగ్రామాన మువ్వన్నెల పతాకం రెపరెపలాడింది. ఈ సందర్భంగా పలు చోట్ల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో వేడుకలు నిర్వహించారు.


అశ్వారావుపేటలో పాల్గొన్న ఎమ్మెల్యే జారే


కొత్తగూడెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని


ఇల్లెందులో పాల్గొన్న ఎమ్మెల్యే కనకయ్య


మణుగూరులో ఎమ్మెల్యే పాయం


కొత్తగూడెంలో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్ రాజు


భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావు


జెండా ఎగురవేస్తున్న జడ్పీ సీఈవో


మణుగూరు డీఎస్పీ కార్యాలయంలో..


సత్యనారాయణపురం సీఆర్‌పీఎఫ్ బెటాలియన్‌లో


కొత్తగూడెంలో గౌరవవందనం స్వీకరిస్తున్న జీఎం


పాల్వంచ కేటీపీఎస్‌లో


జూలూరుపాడు తహసీల్దార్ కార్యాలయంలో..


పురస్కారం అందుకుంటున్న సబ్ జైల్ సూపరింటెండెంట్


జెండాను ఆవిష్కరిస్తున్న భద్రాచలం ఏఎస్పీ


అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో...


అన్నపురెడ్డిపల్లి తహసీల్దార్ కార్యాలయంలో


చంద్రుగొండలో...


పాల్వంచ తహసీల్దార్ కార్యాలయంలో..


పాల్వంచ మునిసిపల్ కార్యాలయంలో..


అవార్డు అందుకుంటున్న మణుగూరు తహసీల్దార్


దమ్మపేట తహసీల్దార్ కార్యాలయంలో..


దుమ్ముగూడెంలో...


సుక్మా జిల్లా కిష్టారం పరిధిలో..


కొత్తగూడెం బీజేపీ కార్యాలయంలో...


సుజాతనగర్ పత్తి కాంటా వద్ద


ఇల్లెందు తహసీల్దార్ కార్యాలయంలో..


ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న తుళ్లూరి



కరకగూడెంలో..


అశ్వాపురం తహసీల్దార్ కార్యాలయంలో..


ఏడూళ్ల బయ్యారం పోలీసు స్టేషన్‌లో..


పురస్కారం అందుకుంటున్న పినపాక ఎంపీవో


ఆళ్లపల్లి తహసీల్దార్ కార్యాలయంలో..


బూర్గంపాడు తహసీల్దార్ కార్యాలయంలో..


గుండాల తహసీల్దార్ కార్యాలయంలో...

రవళి సెల్ పాయింట్ బంపర్ డ్రా


విజేత పేరును ప్రకటిస్తున్న డీఎస్పీ రాఘవేంద్రరావు

మణుగూరుటౌన్, జనవరి 26: మణుగూరు పట్టణంలోని రవళి సెల్ పాయింట్ యాజమాన్యం ప్రతీ ఏడాదిలాగానే ఈ ఏడాదికూడా గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం వినియోగదారుల కోసం బంపర్ డ్రాను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మణుగూరు డీఎస్పీ రాఘవేందర్‌రావు హాజరై బంపర్ డ్రాను తీసీ విజేతలకు బహుమతిని అందజేశారు. బీటీపీఎస్‌లో పనిచేస్తున్న రవికుమార్ తొలి విజేతగా నిలవగా డీఎస్పీ అతనికి ప్రథమ బహుమతిగా హోండా షైన్ మోటార్‌బైక్‌ను అందజేశారు. కన్సోలేషన్ బహుమతులు గెలుచుకున్న 8 మంది విజేతలకు స్మార్ట్ వాచ్‌లను బహుమతిగా అందించారు. ఈ సందర్భంగా వినియోగదారులకు బహుమతులను ఇవ్వడంపట్ల రవళి సెల్ పాయింట్ యాజమాన్యాన్ని అభినందించారు. ఇటువంటి ప్రోత్సాహకాలు ప్రకటించడం వల్ల వినియోగదారుల్లో నూతనోత్తేజం లభిస్తుందని అన్నారు నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో సెల్‌పాయింట్ యాజమాన్యం పసునూరి రాము, యాదగిరి, రామారావు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

పంచాయతీల విలీనానికి సీఎంను కలుస్తా: ఎమ్మెల్యే

భద్రాచలం, జనవరి 26: ఏపీ పరిధిలోకి వెళ్లిన ఐదు పంచాయతీలను తిరిగి భద్రాద్రిలో విలీనం చేయడం కోసం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ఉమ్మడి జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రులను కలుస్తానని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. భద్రాచలంలో శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు పంచాయతీలు భద్రాద్రిలో విలీనమైతేనే భద్రాద్రి అభివృద్ధి సాధ్యమన్నారు. కనీసం రోజు సేకరించేందుకు డంపింగ్ యార్డు కూడా లేని దుస్థితి ఉందన్నారు. భద్రాచలం పంచాయతీని మూడుగా విభజించిన క్రమంలో స్థానికుల మనోభీష్టం మేరకే భద్రాద్రిపై తుది నిర్ణయం ఉంటుందని వెల్లడించారు. రాబోయే గ్రాడ్యుయేట్స్ ఎన్నికల్లో ఓటు నమోదు చేయించుకోవాలని కోరారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఆఫీసు ఇన్‌చార్జికి ఇవ్వవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సత్వర న్యాయానికి మార్గం సుగమం

నేడు అదనపు జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ప్రారంభం

ప్రారంభించనున్న హైకోర్టు న్యాయమూర్తి వేణుగోపాల్

పాల్గొననున్న హైకోర్టు న్యాయమూర్తులు నగేష్, శరత్

భద్రాచలం, జనవరి 26: భద్రాచలం ఏజెన్సీలోని కక్షిదారులకు సత్వర న్యాయం అందేందుకు మార్గం సుగమం అయింది. భద్రాచలం జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో అదనపు జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టును శనివారం ప్రారంభించనున్నారు. ఈ కోర్టును హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పరిపాలన అధికారి జస్టిస్ ఈవీ వేణుగోపాల్ ప్రారంభించనుండగా హైకోర్టు న్యాయమూర్తులు భీమపాక నగేష్, ఖాజా శరత్‌లతో పాటు జిల్లా ప్రధాన న్యాయాధికారి వసంత్‌పాటిల్, భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట దేవదానంతో పాటు కమిటీలోని నాయకులు, సభ్యులు పాల్గొననున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటి వరకు సుమారు మూడువేల కేసులు పెండింగులో ఉన్నట్లు భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోట దేవదానం తెలిపారు. అదనపు జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటుతో వేగంగా కేసులు పరిష్కారమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే ఇతర సమస్యలకు పరిష్కారం లభించనుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భద్రాచలం, జనవరి 26: భద్రాచలం పట్టణంలో శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాను నిలిపివేయనున్నట్లు భద్రాచలం ట్రాన్స్‌కో ఏఈ రాజారావు తెలిపారు. 132 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మత్తుల్లో భాగంగా ఉదయం 9 గంటల నుంచి 3 గంటల వరకు కొర్రాజులగుట్ట, అయ్యప్పకాలనీ, బ్రిడ్జి రోడ్డు, రెవిన్యూ, అశోక్‌నగర్, ఎంఎస్‌, భూపతిరావు, చర్ల రోడ్డులోని కాలనీలు, ఇండస్ట్రియల్ ఏరియా, ఎంపీ కాలనీ ఎఎస్ఆర్ కాలనీ, భగవాన్‌దాస్, జగదీష్ కాలనీల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నారు. ఇందుకు విద్యుత్ వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.

బూర్గంపాడులో దొంగల హల్‌చల్

బూర్గంపాడు, జనవరి 26: బూర్గంపాడు మండల పరిధిలో దొంగలు హల్‌చల్ చేశారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లను టార్గెట్‌గా చోరీకి పాల్పడ్డారు. మోరంపల్లిబంజర గ్రామంలోని ప్రదీప్ చారి కుటుంబసభ్యులు ఈ నెల 24న ఉదయం మేడారం వెళ్లారు. తిరిగి 25న రాత్రికి ఇంటికి చేరుకున్నారు. అప్పటికే ఇంటి తలుపులను తెరిచి ఇంటిలోని వస్తువులను చిందరవందరంగా పడవేయడంతో దొంగతనం జరిగినట్లుగా గుర్తించారు. ఇంట్లోని 4తులాల బంగారం, 25వేల నగదు, 25తులాల వెండి అపహరణకు గురయినట్లు గుర్తించారు. అదే గ్రామానికి చెందిన కామిరెడ్డి భారతి ఇంట్లో చోరీకి పాల్పడి నగదును అపహరించారు. గౌతపురం కాలనీకి చెందిన పల్లపు రమాదేవి కుటుంబసభ్యులు ఈ నెల 23న హన్మకొండ వెళ్లారు. తిరిగి ఈ నెల 25న సాయంత్రం ఇంటికి చేరుకున్నారు. లోపలికి వెళ్లి చూడగా వంట గది తలుపులు తెరిచి లోపలికి వచ్చి బీరువా తెరిచి బీరువాలోని 25తులాల వెండి పట్టీలు, రూ.80వేల నగదు దొంగలించినట్లు బాధితులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు, క్లూస్ టీం ఘటనా స్థలాలను పరిశీలించారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ఇల్లెందుటౌన్, జనవరి 26: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్తా పనిచేయాలని టీపీసీసీ సభ్యుడు డాక్టర్ లకావత్ లక్ష్మినారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం ఇల్లెందులో సామాజిక కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ పార్లమెంట్ నుంచి బరిలో ఉంటున్నానని వివరించారు. దేశంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిందన్నారు. మతం పేరుతో రాజకీయలు చేస్తు దళితులు, గిరిజనులపై దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే దేశం అంథకారంలోకి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ వ్యతిరేకంగా కాంగ్రెస్ గెలుపుకోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎల్‌హెచ్‌పీస్ రాష్ట్ర నాయకులు గోగులోత్ భీమానాయక్, వాసు, వివిధ సామాజిక సంఘాల నాయకులు మంగీలాల్, రామ్‌దాస్, చింటు, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.